
**నిద్రపోని దేవుడికి పూజారి సుప్రభాతం పాడుతున్నాడు.**

**నిద్రపోని దేవుడు-భక్తులొస్తారనే భయభక్తులలో రాయిలా నిలబడే ఉన్నాడు.**

**ఆలయం మీద వాలిన తల్లి కాకి కావ్ కావ్ అని అరుస్తోంది. దేవుడికి మొక్కాలన్నా, దెబ్బ తగిలినప్పుడు బాధతో అమ్మా అని అరవాలన్నా పాపం, కాకికి వచ్చిన భాష, దేవుడిచ్చిన భాష కావ్.... కావ్....**



# సత్రం కాకి

యం.వి.యస్. హరనాథరావు

తల్లి కాకికి ఆ దిగులు చాలా ఉంది.

తల్లి కాకి ఇల్లు అక్కడికి దగ్గరగా కనిపించే వేపచెట్టు మీద ఉంది.

తల్లి కాకి భర్త ఈమధ్యనే ఓ కరెంటు స్తంభం మీద వాలడం వల్ల షాక్ తగిలి కావ్‌మన్నాడు. షాకు తగిలి కాకులు చస్తున్నాయి కాబట్టి మీ ప్రభుత్వం హయాంలో కరెంటు కొరత లేదని మంత్రిగారు ప్రకటించారు. ఆ విషయం టి.వి. వార్తలో వచ్చే సమయానికి కరెంటు పోవడంవల్ల సదరు నిజం జనానికి నిజంగానే చేరలేదు.

పాపం కాకమ్మ, నలుగురు పిల్లల కాకులతో వేపచెట్టు మీద కాలక్షేపం చేస్తోంది.

"అమ్మా! అమ్మా! మనదే కులం?"

"కాకి కులం."

"అమ్మా! అమ్మా! మనదే మతం?"

"కాకి మతం."

పిల్ల కాకుల ప్రశ్నలకు తల్లికాకి అంతకంటే ఏం సమాధానం చెప్పగలదు?

ఏ కులమో, ఏమతమో చెప్పటానికి మాటలొచ్చినా, మెదడు పెరిగిన మనిషి కాదుగా?

పిల్ల కాకి ఓ సారి ఓ స్కూలుమీద వాలింది.

మాస్టారు కాకి-నీళ్లకుండ కథ చెబుతున్నాడు. కుండలో అడుగున ఉన్న నీళ్లు పైకి రావడానికి ఓ కాకి తెలివిగా రాళ్లు కుండలో వేసి, నీళ్లు పైకి రప్పించి, దాహం ఎలా తీర్చుకుందీ చెబుతున్నారు.

తన జాతిని పొగుడుతున్నందుకు ఆనందంగా, గర్వంగా కావ్ కావ్ అరిచింది పిల్ల కాకి.

మాస్టారికి కోపం వచ్చి విసిరిన రాయి దెబ్బకు పిల్ల కాకి కాలు విరిగింది.

కాలు విరిగిన పిల్ల కాకిని వోదారుస్తూ కాకమ్మ అంది.

"ఈ మనుషులింతేనమ్మా! నీతి కథలు చెప్పడానికి పక్షుల్నీ, జంతువుల్నీ వాడుకుంటారు."

"మనుషుల్ని వాడుకోవచ్చుగా!"

"నిజమే! కానీ నీతికథలు వాళ్లకు అతకవని అనుమానమేమో!"

ఇలా లోకజ్ఞానం పిల్లలకు చెప్పుకుంటూ కాలం వెళ్లబుచ్చుతున్న కాకమ్మకు ఈమధ్య ఆరోగ్యం దెబ్బతింది.

ఇదివరకటిలా ఎక్కువసేపు ఎగరలేకపోతోంది.

వయసని సరిపెట్టుకుంటే, తన వయసు కాకి ఈ మధ్యనే అమెరికాలో కాకులు తెల్లగా ఉంటాయని విని చూడటానికి వెళ్లి తిరిగొచ్చేసింది.

కాకమ్మ అనారోగ్యం చూసి పిల్ల కాకులు దిగులుపడ్డాయి.

"డాక్టరు కాకికి చూపించుకోమ్మా!" అంటూ బతిమలాడాయి.

పిల్లల మాట తోసెయ్యలేక తల్లి కాకి, డాక్టరు కాకి దగ్గరకు వచ్చింది.

డాక్టరు కాకి 'ముక్కువాసి' (కాకులకు హస్తాలుండవని హస్తవాసి బదులు ముక్కువాసి అని వాడాను) మంచిదని కాకిలోకం నమ్మకం.

డాక్టరు కాకి ఎక్కువగా ప్రభుత్వ హాస్పిటల్స్‌మీద వాలుతూ వైద్యం ఎలా చెయ్యకూడదో బాగా నేర్చుకుంది.

డాక్టరు కాకి తల్లి కాకిని చెట్టుకొమ్మ మీద పడుకోబెట్టింది.

పరీక్షలు చేస్తోంది.

"అయితే ఇదివరకులా ఎగరలేకపోతున్నావ్?"

"అవును, డాక్టరుగారూ! ఎగిరితే ఆయాసంగా ఉంటోంది."

"అరచినా కూడానా?"

"అవును."

కాకమ్మ రెక్కలు అటూ ఇటూ తిప్పి చూసింది డాక్టరు కాకి.

కాళ్లను ముక్కుతో ఓసారి గీక్కుని (మనిషయితే బుర్ర గీక్కుంటాడు) రెక్కలు కొట్టుకుంటూ డాక్టరు కాకి ఆలోచిస్తోంది.

అక్కడ కాకి ఈక పడితే శబ్దం అయ్యేంత నిశ్శబ్దంగా ఉంది.

"చెప్పండి, డాక్టర్!"

"నీ ఒంట్లో ఫాట్... అంటే కొవ్వుశాతం బాగా పెరిగింది."

పిల్ల కాకులు ముఖాలు చూసుకున్నాయి.

"ఎక్కువగా నెయ్యి, నూనె పదార్థాలు తినడం వల్ల కొవ్వు పెరుగుతంది. దానివల్లనే ఆయాసం. అది హార్ట్ ఎటాక్‌కి కూడా దారితీస్తుంది."

కాకమ్మకు నోట మాట రాలేదు.

కావ్... కావ్... అనలేకపోయింది.

"మీరు చెప్పేది నిజమా, డాక్టర్!"

కాకమ్మ కళ్లల్లో నీళ్లు... ఆ నీళ్లు చూచిన పిల్ల కాకుల కళ్లల్లో నీళ్లు.

కాకమ్మ పెద్ద కూతురు, బాధ భరించలేక... "అమ్మా! మేం చెప్తే నీవు విన్నావా?"

"ఏం చెప్పారు?"

"మేం ఉండే చోటికి దగ్గరలో ఓ సత్రం ఉందండీ!"

"సత్రం అంటే చచ్చిపోయినవాళ్లకు కర్మలు చేస్తారు... అదేనా?"

"అవును, సార్! ఆ సత్రంలో నెలకున్న ముప్పయి రోజులూ కర్మలు చేస్తూనే ఉంటారు."

"కర్మలకూ, మీ అమ్మ జబ్బుకూ ఏమిటి సంబంధం?"

"ఉందని నా అనుమానం, డాక్టర్! కర్మలు చేసేవాళ్లు నెయ్యి బాగా కలిపిన అన్నం... పిండాలు చేసి పితృదేవతలకు పెడతారు. పితృదేవతలు వచ్చి పిండాలు తినలేరు కదా! అందుకని కాకుల్ని కావ్... కావ్... అంటూ పిలుస్తారు. మా అమ్మ ఎగురుకుంటూ వెళ్లి నెయ్యి బాగా కలిపిన ఆ పిండాలు తెగ తినేస్తుంది."

డాక్టరు కాకి కాకమ్మను కోపంగా చూశాడు.

"అందుకే నీకు ఫాట్ బాగా పెరిగింది! రక్తనాళాల్లో, రెక్కల్లో కొవ్వు చేరింది... ఆ మాత్రం డైట్ కంట్రోల్ చెయ్యలేకపోతే ఎలా?"

కాకమ్మ డాక్టరు కాకిని చూడలేకపోయింది.

"ఏం చెయ్యను, డాక్టర్! తినకుండా ఉండలేకపోతున్నాను. బతికున్నవాళ్లు పెట్టని తిండి చచ్చినవాళ్లు పెడుతున్నారు. మేం పిండాలు తింటే చచ్చినవాళ్లు తిన్నంత సంబరపడుతున్నారు."

డాక్టరు కాకి కోపంతో కావ్ కావ్ అంటూ అరిచాడు.

"చచ్చినవాళ్ల కోసం నీవూ చస్తావా? అసలు కాకులు పితృదేవతలని ఎలా అనుకుంటారు - అజ్ఞానం కాకపోతే! వేమన ఏమన్నాడో తెలుసా? 'పియ్య తినెడి కాకి పితరుండెట్లాయరా?' అన్నాడు. వినలేదా! ఈ మనుషుల పిచ్చినమ్మకాలను బతికించడానికి నీవూ చస్తావా!"

కాకమ్మ కళ్లలో నీరు.

"ఇకనుంచీ నీవు పిండాలు తినడం మానేయ్! మనుషులు చూడూ, ఉదయం, సాయంత్రం నడుస్తారు! ఎందుకు? కొవ్వు కరగడానికి. నీవూ అదే పని చెయ్యి. కొమ్మలమీద అటూ ఇటూ ఎగురు. మీరు వెళ్లొచ్చు!" అంటూ ఇంకో చెట్టు మీదకు ఎగిరింది డాక్టరు కాకి.


కాకమ్మ చుట్టూ పిల్ల కాకులు కన్నీళ్లు పెట్టుకున్నాయి.

"మమ్మల్ని తల్లి లేనివాళ్లను చేస్తావా, అమ్మా! పిండాలు తినడం మానెయ్యవా అమ్మా!"

ఆ రాత్రి కాకమ్మకు నిద్ర లేదు.

తన చావు కోసం ఏర్పాటు చేసిన మందుపాతరలా కనిపిస్తోంది సత్రం.

ఆ సత్రం గోడ ఆనుకుని ఉన్న అరుగుల మీద అడుక్కునే వాళ్లుంటారు. కాకమ్మ వాళ్లను చూచింది.



"నేను జీవితంలో చేసిన మంచేమిటి? వెధవ కాకి బతుకు బతికాను! కాకుల అరుపులు విని



# ట్రాక్ మిస్సయ్యా!

ఒకప్పుడు అర్జున్ కమర్షియల్ హీరోగా తెలుగులోకూడా వెలిగిపోయాడు. అర్జున్ నటించిన చాలా చిత్రాలు శతదినోత్సవాలు చేసుకున్నాయి.

అయితే, "దర్శకత్వంలో అడుగుపెట్టి ట్రాక్ మిస్సయ్యాను. తమిళంలో సినిమాలు చేయడం వలన తెలుగులో దూరమయ్యాను. నిజానికి 'శుభవార్త' సినిమా చాలా బాగా వచ్చిన సినిమా. నాకు నచ్చిన సినిమా. నేను తెలుగు ప్రేక్షకులకు దూరమవడం వలన ఆ సినిమా నేను ఆశించినంత ఆదరణకు నోచుకోలేదు. అయినా, మరో మంచి సినిమా 'హలో ఫ్రెండ్!'. దర్శకుడు జగన్...రాము శిష్యుడు. టెక్నికల్‌గా చాలా రిచ్‌గా తీశాడు. మరెలా రిసీవ్ చేసుకుంటారో వేచి చూడాలి. ఎనీ వే నేను తెలుగు ట్రాక్ మిస్సయ్యానేమో!" అంటూ తన అభిప్రాయం వెలిబుచ్చాడు. 'హలో ఫ్రెండ్' చూసిన ట్రేడ్ వర్గాలవాళ్లు బాగుందను కుంటున్నారు.

ఐ.ఆర్.

మనుషులు నిద్ర లేస్తారు. ఒక్క పిండాల సమయంలో తప్ప, మిగిలిన సమయాల్లో కసురుకుంటారు! ఈ మనుషులకు కృతజ్ఞత లేదు! చచ్చేలోగా నేనేం చేయాలి? ఏం చేస్తే పుణ్యం వస్తుంది?"

కాకమ్మ ఆలోచిస్తోంది.

సత్రం దగ్గర ముష్టివాళ్ల డొక్కలు తినిపారేసిన ఎముకలమీద చర్మం కప్పినట్లు ఉన్నాయి. వాళ్ల కళ్లల్లో ఆకలి... మేధావులకు కనబడని విజ్ఞానంలా, నాయకులు పట్టించుకోని అవినీతిలా, దేవుడు పారేసుకున్న తెలివిలా ఉన్నాయి.

పాపం బిచ్చగాళ్లు... ఆకలి తింటూ, పీలిస్తూ, తాగుతూ ఆకలికి పుట్టిన అనాథల్లా, ఆకలి పెంచిన ముళ్లకంపల్లా, ఆకలి కట్టిన సమాధుల్లా... ఆకలి చంపిన శవాల్లా కాకమ్మకు ఆ రోజు కనిపించారు.

సత్రానికి వచ్చేవాళ్లు ఏ నాడూ వాళ్లను గురించి పట్టించుకోలేదు.

చచ్చిపోయినవాళ్ల ఆకలి కోసం పిండాలు పెట్టేవాళ్లు బతికున్న వాళ్లను గురించి ఆలోచించక ఎందుకు చంపుతున్నారు?

సెంటిమెంట్స్ ఉన్న కాకమ్మ ఆ రోజు బిచ్చగాళ్లను గురించి ఆలోచించి, ఓ నిర్ణయానికి వచ్చింది.

కాకి జన్మ ఎత్తినందుకు చచ్చేలోపు ఏదైనా మంచి పని చెయ్యాలి.

కాకమ్మలో... ఆలోచన... ఏం చెయ్యాలి...?

సత్రం నుంచి మంత్రాలు...

నిప్పుల్లో నెయ్యి పోస్తున్న వాసన.

కాకమ్మకు నోరూరింది.

నెయ్యి వాసనకు బిచ్చగాళ్ల కడుపులో ఆకలి ఊరింది.

కాకమ్మ సత్రం వైపు ఎగురుకుంటూ వెళ్లింది.

"అమ్మా! వద్దు!" అని పిల్ల కాకులు కాకిగోల చేస్తున్నా వినకుండా వెళ్తోంది.

పిండాలు తీసుకుని ఒక యువకుడు సత్రం డాబా మీద పెట్టాడు. పిండాల్లో పితృదేవతలను చూసుకుంటూ నమస్కారం చేశాడు. కాకుల రూపంలో వచ్చే పితృదేవతల కోసం బంధువర్గం ఎదురు చూస్తున్నారు.

కాకులు రాలేదు.

రాకుండా కాకమ్మ కట్టడి చేసింది.

"కావ్... కావ్...!" బంధువులు అరుస్తున్నారు.

"కాకిగా పుట్టినా బాగుండేది!" బిచ్చగాడి సణుగుడు.

కాకులు రాకపోవడంతో బంధువులకు విసుగుపుట్టింది. అవే వస్తాయిలే అనుకుంటూ వెళ్లిపోయారు.

కాకమ్మ రెక్కలు విదుల్చుకుంది.

ఆ పిండాలు ఆకలితో అల్లాడే బిచ్చగాళ్లు తినాలి. కానీ ఎలా? ఏం చెయ్యాలి?

ముక్కుతో బుర్ర గీక్కోడానికి ప్రయత్నించింది. బుర్ర అందకపోయినా ఆలోచన మాత్రం అందింది.

తను ఎగురుకుంటూ వెళ్లి బిచ్చగాడి నెత్తిన ముక్కుతో పొడిస్తే వాడు విసుక్కుంటాడు. విదిలిస్తాడు. రెండోసారి పొడిస్తే కోపం వచ్చి కొట్టడానికి లేస్తాడు... అలా పొడుస్తూ ఉంటే చంపడానికి వెంటపడతాడు. వెంటపడ్డవాడిని నీరుగా పిండాలదాకా తీసుకెళ్తే... అవును తీసుకెళ్తే... అక్కడ ఎవరూ లేరు కాబట్టి నెయ్యి కలిపిన అన్నం ముద్దలు తినేస్తాడు. వాడి కడుపునిండే దారి చూపినందుకు తనకు సగం పుణ్యం అయినా దక్కుతుంది.

ఆలస్యం చెయ్యకుండా అనుకున్నది అనుకున్నట్లు చేసింది కాకమ్మ.

"వెధవ కాకి!" అంటూ కర్ర తీసుకుని కాకమ్మ వెంటపడ్డాడు బిచ్చగాడు.

కాకమ్మ సత్రం మీదకు వచ్చింది.

బిచ్చగాడూ వచ్చాడు.

కాకమ్మ పిండాల చుట్టూ అరుస్తూ తిరుగుతోంది.

కాకి భాష తెలియకపోయినా, ఆకలి భాష తెలిసి బిచ్చగాడు పిండాలను చూశాడు.

మనిషి-కాకిలా పిండాలమీద వాలాడు.

కాకి-మనిషిలా సంబరపడింది.

పిండాన్ని చేత్తో తీసుకుని నోట పెట్టుకోబోయాడు.

అతని నెత్తిన కర్ర పడింది.

పిండం బంధువులు దెయ్యాల్లా చూస్తున్నారు.

"పితృదేవతలకు పెట్టిన పిండాలు తింటావా, దరిద్రుడా!"

బాధతో మూలుగుతున్నాడు బిచ్చగాడు. వాడ్ని వీధిలోకి విసిరేశారు.

మంత్రాలకంటే బూతులు ఎక్కువగా సత్రం నుంచి వినిపిస్తున్నాయి.

కాకమ్మ కళ్లవెంట నీరు.

'పుణ్యానికి పోతే పాపం వచ్చిందంటారు, ఇదే కాబోలు!'

కాకమ్మను పిల్ల కాకులు ఓదార్చాయి.

బిచ్చగాడి చుట్టూ కాకుల్లా చేరిన బిచ్చగాళ్ల ఓదారుస్తున్నారు.

కాకి శకునాన్ని చూస్తారు.

కాకులమీద నీతి కథలు అల్లుతారు.

ఒక కాకి చస్తే వంద కాకులు ఏడుస్తాయి. వాటికున్న కట్టడి మనకు లేదని బాధపడతారు.

అన్ని ఆలోచనలు ఉన్న మనుషులు... సాటి మనిషిని ఎందుకు చూడరు. చూసి ఎందుకు ఆదుకోరు?

తెల్లారింది.

ఆ రాత్రంతా నిద్రపోని కాకమ్మ సత్రం వైపు చూసింది.

అరుగు మీద బిచ్చగాళ్లెవరూ కనిపించలేదు.

"పాపం ఆ బిచ్చగాడు ఏమయ్యాడు? తగిలిన దెబ్బకు చచ్చిపోయాడా?"

సత్రం నుంచి మంత్రాలు.

తల్లి కాకి బిచ్చగాడి కోసం వెదుకుతోంది.

సత్రం డాబా మీద పిండాలు పెట్టారు.

కావ్ కావ్ అంటూ కాకులను ఆహ్వానిస్తున్నారు.

"ఈ కాకులకు కూడా ఒళ్లు బలిసింది. ఇదివరకటిలా ఉదయం కాగానే అరవడంలేదు. సుఖం నేర్చాయి. మిలట్రీ హోటళ్లకు అలవాటుపడి శాకాహారమే ముట్టడంలేదు!"

"పిండాల్లో చికెనూ, మటనూ ముక్కలు కలిపితే కానీ వచ్చిచచ్చేట్లు లేవు!"

బంధువులు విసుక్కుని, కాకులు రాకపోవడంతో అందరూ బయలుదేరారు.

"నాన్న బతికున్నప్పుడూ సాధించాడు. ఇప్పుడు చచ్చి సాధిస్తున్నాడు!" చచ్చినవాడి కొడుకు ఫీలయ్యాడు.

"కాకులు వస్తాయేమో, కాసేపు చూద్దామా మావయ్యా!" ఇంటిదారి పడుతూ అడిగాడు.

"అవే వస్తాయిలేరా!"

"పిండాలు కాకులు ముట్టలేదని తెలిస్తే అమ్మ ఫీలవుతుందేమో!"

"తినేశాయని చెబుదాం."

"అబద్ధమా?"

కొద్దిదూరం వాళ్లు నడిచేసరికి సత్రం పైనుంచి కాకుల అరుపులు వినిపించాయి.

"కాకులు వచ్చాయి, పిండాలు తింటున్నాయి మావయ్యా!"

"మీ నాన్నకు నీమీద చచ్చేంత ప్రేమరా! ఆ కాకి గొంతు విను. అచ్చు మీ నాన్న గొంతులానే ఉంది!"

కాకమ్మ ఆశ్చర్యపోయింది.

ఎక్కడనుంచి వచ్చాయి కాకులు.

'ఓ బిచ్చగాడికి జరిగిన అన్యాయం తెలిసి కూడా పిండాలు తినడానికి సిగ్గు లేదూ! అందుకే కాకిబుద్ధి అన్నారు! ఛీ! ఛీ!' అనుకుంటూ సత్రం వైపు వెళ్లింది కాకమ్మ.

అక్కడి దృశ్యం చూచి కాకమ్మ మరింత నల్లబడింది.

బిచ్చగాళ్లు "కావ్... కావ్..." అని అరుస్తూ అక్కడి పిండాలు ఆశగా తింటున్నారు.

ఆ కావ్‌కావ్‌లు వింటూ కాకులు తింటున్నాయని బంధువులు సంతోషపడుతున్నారు.

తల్లి కాకిలో ఆనందం-తమ జాతి భాష కొందరికయినా అన్నం పెట్టినందుకు.

మనిషికున్న రెక్కలు... మంచిని తప్పించుకుని ఎగరడానికి.

పక్షులకున్న రెక్కలు... తప్పించుకున్న మంచిని మనిషికి అందజేయడానికి అని తెలుసుకున్న కాకమ్మ, పిల్లలు ఆనందంతో రెక్కలు కొట్టుకున్నాయి.

కాకులొచ్చి పిండాలు తింటున్నాయని మనిషి సంతోషించాడు.

మనిషొచ్చి పిండాలు తింటున్నాడని కాకులు సంతోషించాయి. ■



# నవ్వు-వ్యక్తిత్వం

**జో**క్ కాదు....మీరు నవ్వే విధానం మీ వ్యక్తిత్వాన్ని తెలియచేస్తుంది. ఫ్లోరిడాలోని మియామి బీచ్‌కి చెందిన మానసిక శాస్త్రవేత్త ఎలనికాన్ రెండున్నరేళ్ల పరిశోధన చేసి ఈ విషయంమీద డాక్టరేట్‌కూడా సంపాదించింది. నవ్వుల్లో రకాలు చూద్దామా?

**జిగిల్(చిరుమందహాసం):** ఇలా నవ్వేవాళ్లు ఆశావాదులు, నిగర్వులు, పొగడ్తకి లొంగనివారు.

**గఫా(విరగబడి నవ్వడం):** కడుపు కదిలేలా నవ్వేవాళ్లు, నిర్మొహమాటస్తులు. ఇతరులేం అనుకుంటారో అని లెక్క చేయకుండా అవకాశాలను అందిపుచ్చుకునేవారు. ఒంటరితనంకన్నా కంపెనీని కోరుకునేవారు.

**కేకిల్(శబ్దం దూరంగా వినిపించేలా నవ్వడం):** రద్దీగా ఉండే ప్రదేశంలోకూడా ఈ నవ్వుని అందరూ వినవచ్చు. జోక్స్ చెప్పడం, ఇతరులని నవ్వించడం ఈ తరహా మనుషులకి ఇష్టం. ఎలాంటి కష్టమైన సందర్భంలోనైనా హాస్యాన్ని చూడగలరు వీళ్లు. వీళ్లకి కోపం తక్కువకాబట్టి వీళ్లతో ఎవరైనా గెటాన్ కావచ్చు.

**స్నోర్ట్(నవ్వుని దాచుకోవడంతో గాలి ముక్కులోంచి రావడం):** నవ్వుని దాచుకునేవాళ్లు స్వతహాగా సిగ్గరులు. ఇతరులు తమని గుర్తించకుండా ఉండటం ఇష్టపడేవారు. నియమాలను పాటించడానికి ఇష్టపడేవారు. ఇతరుల భావాలను అర్థం చేసుకోగలరు.

**ఆర్డినరీ లాఫ్(మామూలు నవ్వు):** మరీ గట్టిగా కాకుండా, ఎక్కువసేపు కాకుండా నవ్వే ఈ నవ్వుని నవ్వేవాళ్లు కష్టపడి పనిచేసే రకం. ఇతరులకి చక్కటి ఫ్రెండ్‌గా ఉండగలరు. వీళ్లు అప్పులు తీర్చడంలో సిద్ధహస్తులు. వీలైనంతవరకు అప్పు చేయడానికి ఇష్టపడరుకూడా.

-డి. పద్మజ